భారత రాజ్యాంగం - ప్రవేశిక

Preamble (ప్రవేశిక) అనే లాటిన్ పదానికి అర్థం 'పరిచయం'. ప్రతి ప్రముఖ గ్రంథానికి ఉండే ముందుమాట ఏ విధంగా ఆ గ్రంథం గురించి తెలుపుతుందో మన రాజ్యాంగానికి ఉన్న ప్రవేశిక కూడా రాజ్యాంగం ఆశయాలను, లక్ష్యాలను వివరిస్తుంది. రాజ్యాంగ నిర్మాతలు ఏ ఆశయంతో రాజ్యాంగాన్ని రచించారో తెలియజేస్తున్నందువల్ల భారత సుప్రీంకోర్టు బేరుబారి కేసు(1980)లో ప్రవేశికను రాజ్యాంగ నిర్మాతల మదికి తాళంచెవిగా అభివర్ణించింది. రాజ్యాంగంపై వ్యాఖ్యానించే అధికారం ఉన్న అత్యుత్తమ న్యాయస్థానమైన సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో వివిధ రకాలుగా ప్రవేశికను పరిగణించింది.

బేరుబారి అనే 9 చదరపు మైళ్ల విస్తీర్ణం గల ప్రాంతం విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య తలెత్తిన వివాదం సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానిస్తూ 'ప్రవేశిక' భారత రాజ్యాంగంలో భాగం కాదని పేర్కొంది. అయినప్పటికీ రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు, రాజ్యాంగ లక్ష్యాలు తెలుసుకోవడానికి, ఏదైనా ఆర్టికల్ విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడు దాని అసలు ఉద్దేశం కనుక్కోవడానికి ప్రవేశిక తోడ్పడుతుందని ఇదే సందర్భంలో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

ప్రాథమిక హక్కుల కేసుగా ప్రాముఖ్యం పొందిన కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు(1973)లో సుప్రీంకోర్టు రాజ్యాంగానికి కొన్ని మౌలిక లక్షణాలున్నాయని పేర్కొంది. రాజ్యాంగంలో ప్రవేశిక భాగమే అని, అది కూడా రాజ్యాంగ మౌలిక లక్షణమే అని తీర్పునిచ్చింది. బేరుబారి కేసులో రాజ్యాంగంలో ప్రవేశిక భాగం కాదని చెప్పడం ద్వారా ఆర్టికల్ 368 ఉపయోగించి ప్రవేశికను సవరించడానికి వీలులేకుండా చేసిన సుప్రీంకోర్టు, కేశవానంద భారతి కేసులో ప్రవేశికను రాజ్యాంగంలో భాగం చేయడం ద్వారా సవరణకు అవకాశం కల్పించింది. దాంతో పార్లమెంట్ 42వ రాజ్యాంగ సవరణ (1976) ద్వారా ప్రవేశికలో ''సామ్యవాద, లౌకిక'', ''ఏకత, సమైక్యత'' అనే పదాలను చేర్చి, జనవరి 3, 1977 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు రాజ్యాంగ ప్రవేశికకు జరిగిన ఏకైక సవరణ ఇదే.

సవరించిన రాజ్యాంగ ప్రవేశిక ఈ కింది విధంగా ఉంది.

''భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా తీర్చిదిద్దడానికి కృతనిశ్చయులమై ఉండి, భారత ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో - న్యాయాన్ని, భావాలు, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం, ఆరాధనల్లో - స్వేచ్ఛను, హోదాలు, అవకాశాల్లో - సమానత్వాన్ని కల్పిస్తామని, ప్రజలందరిలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తామని, వ్యక్తి గౌరవానికి, జాతి ఏకత, సమైక్యతలకు పాటుపడతామని హామీ ఇస్తూ రాజ్యాంగ పరిషత్‌లో 26 నవంబర్, 1949 నాడు, ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం''.

రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు ప్రతీక అయిన ప్రవేశికలోని ప్రతి పదం ఒక ప్రత్యేక అర్థాన్ని మనకు తెలియజేస్తుంది. ''భారత ప్రజలమైన మేము'' అని ప్రవేశిక ప్రారంభం కావడం భారత రాజ్యాంగాన్ని భారత ప్రజలే రూపొందించుకొని, ఆమోదించుకున్నారని తెలుపుతుంది. ఈ పదాన్ని అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు.

సర్వసత్తాక:

ఆగస్టు 15, 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ బ్రిటిష్ రాణి నామమాత్రపు రాజ్యాంగాధిపతిగా 26 జనవరి 1950 వరకు వ్యవహరించారు. ఆనాటి నుంచి అమల్లోకి వచ్చిన రాజ్యాంగం భారతదేశాన్ని సర్వసత్తాక దేశంగా ప్రకటించింది.

సామ్యవాద:

ఈ పదం తొలుత లేనప్పటికీ 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చారు. ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న ఆశయాలకు ప్రతీకగా దీనిని చేర్చారు. నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1983) కేసులో సుప్రీంకోర్టు 'సామ్యవాదం' అనేది మార్క్సిజం, గాంధీయిజాల కలయికగా పేర్కొంది. అందులోనూ గాంధేయవాద సామ్యవాదం వైపు ఎక్కువగా మొగ్గి ఉందని, ఇది కమ్యూనిస్టు తరహా సామ్యవాదం కాదని, భారత అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించుకొన్నదని తీర్పునిచ్చింది.

లౌకిక:

ప్రవేశికలో ఈ పదం కూడా 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేరిందే. పొరుగు దేశాలన్నింటికీ అధికార మతాలు ఉన్నప్పటికీ, భారతదేశానికి ప్రత్యేకంగా అధికార మతం అంటూ లేకపోవడం, పౌరులందరికీ తమ మతాన్ని పాటించే అవకాశం కల్పించడం, ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించడం వంటివి భారతదేశ లౌకికత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

ప్రజాస్వామ్య:

ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఉండే ప్రభుత్వం అనేది ప్రజాస్వామ్య లక్షణం. మన దేశంలో నిర్ణీత కాలంలో జరిగే ఎన్నికలు, 18 ఏళ్ల దాటిన వ్యక్తులందరికీ ఓటు హక్కు వంటివి ప్రజాస్వామ్య లక్షణాలను తెలియజేస్తాయి.

గణతంత్ర రాజ్యం:

రాజ్యాంగాధినేత వారసత్వ పద్ధతి ద్వారా కాకుండా పరోక్ష పద్ధతిలో జరిగే ఎన్నికల ద్వారా ఎంపికవడం గణతంత్ర రాజ్యస్వభావాన్ని సూచిస్తుంది.

న్యాయం:

సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో ప్రజలందరికీ న్యాయం అందించడానికి స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థను రాజ్యాంగం ఏర్పాటు చేసింది. ఇందిరా గాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ (1975) కేసులో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని ప్రకటించడం ద్వారా ప్రజలందరూ సమానులే అని న్యాయవ్యవస్థ చాటి చెప్పింది.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం:

ఫ్రెంచి విప్లవం(1789)లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఈ భావాలను ప్రవేశికలో చేర్చి, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో వాటి అమలుకు వీలు కల్పించడం ద్వారా మన రాజ్యాంగ నిర్మాతలు భారత దేశాన్ని 'పోలీసు రాజ్యం' నుంచి 'సంక్షేమ రాజ్యం' దిశగా నడిపించారు.

ఏకత, సమైక్యత:

వీటిని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. ఈ పదాల ద్వారా ప్రతి భారతీయుడు తన దేశాన్ని గౌరవించాలని, దాని ఏకతకు, సమైక్యతకు కృషి చేయాలని గుర్తుచేశారు. ఇదే సవరణ ద్వారా ప్రవేశపెట్టిన 51-A ఆర్టికల్ ప్రాథమిక విధుల రూపంలో ఈ లక్ష్యాల సాధనకు చేయాల్సిన పనులను నిర్దేశించింది.

గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు

1. ఏ కేసులో రాజ్యాంగంలో ప్రవేశిక భాగమని సుప్రీంకోర్టు పేర్కొంది? (గ్రూప్ - 2, 2008)

ఎ) కేశవానంద భారతి బి) గోలకనాథ్
సి) ఎస్.ఆర్.బొమ్మై డి) మినర్వా మిల్స్

2. ''స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం'' అనే భావాలను రాజ్యాంగంలో ఏ విప్లవం నుంచి గ్రహించారు? (గ్రూప్ - 2, 2008)

ఎ) రష్యా బి) ఫ్రెంచి సి) అమెరికా డి) జర్మన్

3. ''సామ్యవాద'', ''లౌకిక'' పదాలను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చారు? (గ్రూప్ -2, 2008)

ఎ) 44 బి) 40 సి) 38 డి) 42

4. మన రాజ్యాంగం ముందుమాట(ప్రియాంబుల్)లో ఏ విధంగా రాసి ఉంది? (గ్రూప్ -2, 2008)

ఎ) భారత ప్రజలైన మేము, అంగీకరించి ఏర్పరచి ఈ రాజ్యాంగాన్ని ఇండియాకు ఇస్తున్నాం.
బి) మేము రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులం ఆమోదించి, ఏర్పరచి ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇస్తున్నాం.
సి) మేము, భారత ప్రజలు, ఈ రాజ్యాంగాన్ని ఏర్పరచి, ఆమోదించి మాకు మేము ఇస్తున్నాం.
డి) మేము, భారతదేశ జనులం మా రాజ్యాంగ అసెంబ్లీలో ఆమోదించి, ఏర్పరచి ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇస్తున్నాం.

5. భారతదేశంలో రాజకీయ అధికారానికి ప్రధానమైన ఆధారం? (ఎ.ఇ.ఇ.2007)

ఎ) రాజ్యాంగం బి) ప్రజలు
సి) పార్లమెంట్ డి) పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ్యులు

6. భారత రాజ్యాంగ పీఠికను ఇప్పటి వరకుఎన్నిసార్లు సవరించారు? (ఎండోమెంట్ - 2009)

ఎ) ఎప్పుడూ సవరించలేదు బి) రెండు సార్లు
సి) మూడు సార్లు డి) ఒకసారి

సమాధానాలు

1-ఎ 2-బి 3-డి 4-డి 5-బి 6-డి

ప్రజాస్వామ్య, సామ్యవాద సర్వసత్తాక...

భారతజాతి జాతకచక్రంగా అభివర్ణించే రాజ్యాంగ ప్రవేశికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన లక్ష్యాలు-ఆశయాల తీర్మానం ఆధారంగా రూపొందించారు. రాజ్యాంగ మౌలికతత్వాన్ని ప్రతిబింబించే రాజ్యాంగ పీఠిక మన రాజ్యాంగ సారాంశాన్ని, స్వరూపాన్ని తెలుపుతుంది. రాజ్యాంగ విలువలను మదింపు చేయడంలో ప్రవేశిక, గీటురాయిగా ఉండటంవల్ల భారత రాజ్యాంగానికి ఆత్మవంటిదిగా పేర్కొంటాం. రాజ్యాంగ రూపకల్పనలో ఇమిడి ఉన్న ప్రాథమిక సూత్రాలను తెలిపే రాజ్యాంగ ప్రవేశిక 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశాలను కలుపుకొని సమగ్ర రూపాన్ని సంతరించుకుంది.

''భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా... పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించడానికి నమ్మకంలో, ఆరాధనలో, విశ్వాసంలో భావప్రకటన చేయడానికి స్వేచ్ఛను కల్పిస్తూ.. అంతస్తులో, అవకాశాలలో సమానత్వాన్ని సమకూరుస్తూ.. వ్యక్తి గౌరవాన్ని, జాతి సమైక్యతను, అఖండతను చేకూర్చే సోదర భావాన్ని పెంపొందించడానికి సత్యనిష్టాపూర్వకంగా తీర్మానించుకుని ఈ రాజ్యాంగాన్ని అంగీకరించి అది శాసనం చేసి మాకు మేము ఇచ్చుకొన్నాం'' అని పేర్కొనడం ద్వారా.. భారతదేశంలో అధికారానికి మూలం ప్రజలు అని తెలుస్తోంది. భారతదేశం ఒక సర్వసత్తాక రాజ్యం అనే భావన కలిగిస్తుంది.

స్వేచ్ఛాయుత, ప్రాధికారిత దేశం తన అంతరంగిక అంశాలలో, బహిర్గత విషయాలలో ఇతరుల జోక్యం లేకుండా తనకు తానుగా నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర అధికారమే సర్వసత్తాక రాజ్య సారాంశం. అధికారానికి మూలం ప్రజలు అయినందున ఇతర దేశాలతో వ్యవహరించడంలో, అంతర్జాతీయ సంస్థలలో సభ్యత్వాన్ని కలిగి ఉండటంలో భారత విదేశాంగ నిర్ణయం పూర్తి స్వతంత్రతో కూడుకుంది. కామన్ వెల్త్ దేశాల సభ్యత్వాన్ని పొందడాన్ని.. సాంస్కృతిక మైత్రి సంబంధాలను పెంపొందించుకోవడానికి, అభివృద్ధిలో అంతర్జాతీయ సహకారాన్ని పొందడానికి ఉద్దేశించినదిగానే వర్ణిస్తూ దాన్నుంచి విరమించుకునే స్వతంత్రతను గుర్తుచేశారు.

ప్రజాస్వామ్య సామ్యవాదం..

భారత రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న సామ్యవాద భావజాలాన్ని, ప్రజాస్వామ్య సామ్యవాదంగా పేర్కొన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రైవేటీకరణ వేగంగా జరుగుతున్నందున సామ్యవాదం అర్థాన్ని కోల్పోయిందని, ఆ పదాన్ని ప్రవేశిక నుంచి తొలగించాలనే వాదనలను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించింది. దేశ ఆదాయం న్యాయమైన రీతిలో పంపిణీ అయ్యేటట్లు చూడాలని, ఆర్థిక సమానతను చేకూరుస్తూ.. సంస్కరణల ద్వారా జరిగిన అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి అందుబాటులోకి రానంతవరకు 'సామ్యవాదం' తన అర్థాన్ని కోల్పోదని సుప్రీం పేర్కొంది.

పరిపాలన పూర్తిగా ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉండే భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ దేశంలో ప్రజలే పాలకులు, పాలితులు. ప్రజాస్వామ్యం కేవలం రాజకీయ రంగానికే కాకుండా సామాజిక, ఆర్థిక రంగాలకు కూడా వర్తిస్తుంది. సమాన ప్రతిపత్తి, స్వేచ్ఛ, న్యాయం, మతస్వాతంత్ర్యం వంటి ప్రజాస్వామిక లక్షణాలను మన రాజ్యాంగం కలిగి ఉంది. 73, 74 రాజ్యాంగ సవరణలు ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో భాగమే.

లౌకిక రాజ్యం..

లౌకిక విధానానికి ప్రతీకగా ప్రాచీన కాలం నుంచి విరాజిల్లుతున్న భారతదేశం.. 'లౌకిక రాజ్యం'గా అన్ని మతాలను సమానంగా ఆదరిస్తున్నది. మన రాజ్యాంగం లౌకిక విధానానికి హామీ ఇస్తుంది. రాజ్యాధికార మతం లేకపోవడం వల్ల మత స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారు. భారత ప్రభుత్వం అన్ని మతాల పట్ల తటస్థతను, నిష్పాక్షితను చూపాల్సి ఉంది. మత స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధార పడకుండా ప్రాథమిక హక్కులలో భాగంగా చేర్చారు. ప్రజల విశ్వాసాలను అనుసరించి స్వేచ్ఛాయుత మత అవలంబన, ఆచరణ, ప్రచారాలకు అవకాశం ఉంది.

గణతంత్ర రాజ్యం..

దేశ నర్వోన్నత అధికారం ప్రజలలో.. ప్రజలచే ఎన్నుకొనే ప్రజా ప్రతినిధులలో.. నిక్షిప్తమై ఉండే గణతంత్ర రాజ్యంగా భారతదేశం అవతరించింది. వంశపారంపర్యంగా, వారసత్వంగా ఎలాంటి పదవులకు అవకాశం లేదు. అంటే విశేషాధికార వర్గమంటూ ఏదీ ఉండదు. సాధారణ పదవికి మొదలుకొని దేశాధిపతి పదవికి కూడా ప్రజల ద్వారా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎన్నిక జరుగుతుంది. 1949 నవంబర్ 26వ తేదీ నుంచి భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించింది. అంటే డొమినియన్ స్టేటస్‌ను వదులుకొంది.

ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఫ్రెంచి విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంలు మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నాయి. ఆలోచన, విశ్వాసం, నమ్మకంలో స్వేచ్ఛను కల్పించడం ద్వారా వ్యక్తుల మానసిక, ఆధ్యాత్మిక, మేధో పరమైన రంగాల్లో పరిపూర్ణతకు అంటే సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడవచ్చు. అంతస్తులోను, అవకాశాలలోను సమానత్వాన్ని కల్పించకపోయినట్లయితే స్వేచ్ఛాఫలాలను వ్యక్తులందరూ అందుకునే

అవకాశం లేదు. ప్రజల మధ్య సమానత్వాన్ని సాధించడంలో ఆవశ్యకమైనదిగా సోదర భావాన్ని పేర్కొనవచ్చు. భిన్నత్వానికి నిలయమైన మనదేశంలో జాతీయ సమైక్యతను చాటి, దేశ పటిష్టతను పెంపొందించడంలో సౌభ్రాతృత్వం ప్రాధాన్యాన్ని అంబేద్కర్ వివరించారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పౌరులందరికీ న్యాయాన్ని సమకూర్చాలని రాజ్యాంగ ప్రవేశిక పేర్కొంది. సామాజిక న్యాయాన్ని సాధించడం కోసం స్త్రీ, పురుషులందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పటికీ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక అవకాశాలను కల్పించారు. జాతీయ సంపదను, వనరులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన ఉత్పత్తి, పంపిణీ విధానాన్ని చేపట్టాల్సి ఉంది. రాజకీయ రంగంలో ఎలాంటి అసమానతలు లేకుండా రాజ్యవ్యవహారాలలో, ప్రజా వ్యవహారాలలో స్వేచ్ఛగా పాల్గొనడానికి అవసరమైన రాజకీయ హక్కులు అందరికీ కల్పించారు. వ్యక్తి గౌరవాన్ని కాపాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడి.. జాతి నిర్మాణానికి తోడ్పటం ద్వారా అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉంది.

రాజ్యాంగ ప్రవేశిక ప్రయోజనతను, దాని న్యాయబద్ధతను విశ్లేషించే క్రమంలో 'ప్రవేశిక' రాజ్యాంగంలో భాగం కాదని ప్రాముఖ్యం లేని అలంకారయుతమైందిగా భావించారు. ప్రారంభంలో ఎలా భావించినప్పటికీ కేశవానంద భారతి కేసులో, మినర్వా మిల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అనుసరించి, రాజ్యాంగ నిర్మాతల ఆశయం, ఆకాంక్షల ఫలితంగా భారత రాజ్యాంగం సాధించాల్సిన లక్ష్యాలు, ఆశయాల దిక్సూచిగా పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని అన్వయించడంలో, చట్టాలను అన్వయించడంలో రాజ్యాంగ ప్రవేశికను ఆధారంగా చేసుకోవాలని జస్టిస్ సిక్రి పేర్కొన్నారు. ఎస్.ఆర్. బొమ్మై కేసులో ప్రవేశికను రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగంగా పేర్కొన్నారు.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలోని పీఠిక ఏ దేశ రాజ్యాంగాన్ని పోలి ఉంటుంది?

ఎ) ఫ్రాన్స్ బి) అమెరికా
సి) కెనడా డి) ఇంగ్లండ్

2. లక్ష్యాలు, ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్ భారత ప్రజలకు చేసిన పవిత్ర ప్రతిజ్ఞ అని పేర్కొన్నవారు?

ఎ) కె.ఎం. మున్షీ బి) అంబేద్కర్
సి) హెచ్.వి. కామత్ డి) జవహర్‌లాల్ నెహ్రూ

3. రాజ్యాంగాన్ని అనుసరించి భారతదేశం ఒక..?

ఎ) అర్ధసమాఖ్య బి) రాష్ట్రాల సమాఖ్య
సి) రాష్ట్రాల కలయిక డి) ఏకకేంద్ర ప్రభుత్వం

4. రాజ్యాంగ ప్రవేశికను భారతజాతి జాతకచక్రంగా అభివర్ణించినవారు?

ఎ) ఎర్నెస్ట్ బార్కర్ బి) జస్టిస్ హిదయతుల్లా
సి) కె.ఎం. మున్షీ డి) అంబేద్కర్

5. భారత రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్నట్లు భారత ప్రజలమైన మేము అని కాకుండా భగవంతుడిపైన ప్రమాణం చేస్తూ సమర్పించాలని పేర్కొన్నవారు?

ఎ) శ్రీమన్నారాయణ్ అగర్వాల్
బి) బాబు రాజేంద్రప్రసాద్
సి) గోపాలస్వామి అయ్యంగార్
డి) హెచ్.వి. కామత్

6. భారత రాజ్యాంగ ప్రవేశిక భారత రాజ్యాంగంలో అంతర్భాగం కాదని ఏ కేసులో సుప్రీంకోర్టు తీర్పిచ్చింది?

ఎ) సజ్జన్‌సింగ్ – యూనియన్ ఆఫ్ ఇండియా
బి) బేరుబారి కేసు
సి) గోలక్‌నాథ్ కేసు
డి) కేశవానందభారతి కేసు

7. ఆలోచనలో, విశ్వాసంలో, నమ్మకంలో వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదించాలని పేర్కొనే రాజ్యాంగ భాగం?

ఎ) రాజ్యాంగ ప్రవేశిక బి) ప్రాథమికహక్కులు
సి) ఆదేశిక సూత్రాలు డి) సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలు

8. భారతదేశం గణతంత్ర రాజ్యం ఎందుకంటే?

ఎ) ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగడం
బి) మతప్రమేయం లేని రాజ్యం కావడం
సి) సొంత నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కలిగి ఉండటం
డి) రాష్ట్రపతిని ఎన్నుకోవడం వల్ల

జవాబులు	1	2	3	4	5	6	7	8
	B	D	C	C	D	B	A	D